# బిక్షగాడి బిక్ష

## కల్లూరు మహబూబ్ భాషా



"బస్సులు వస్తున్నాయి - వెళ్ళిపోతున్నయి! కానీ.... రావాల్సిన బస్సింకా రాలేదు. ఇంకెప్పుడొస్తుందో..." అనుకొంటూ తన చేతిలోని వాచ్‌లో టైం చూశాడు -గోపాల్-సాయంత్రం ఐదుగంటలు! బస్సుకోసం ఎదురు చూసి- చూసి విసుగు పుడుతోందతనికి. సెకండ్సు భారంగా- నిమిషాలు నీరసంగా దొర్లుతున్నాయి. ఆలస్యానికే అలవాటుపడ్డ మనదేశం 'పంక్చువాలిటీ' అనే పదానికి న్యాయం చేకూర్చక పోబట్టే- ఇలా తగలబడింది!

చుట్టూ చూశాడు గోపాల్- బస్టాండంతా ప్రయాణీకులతోనూ, వ్యాపారస్తులతోనూ, పని మనుషులతోనూ కిక్కిరిసి వుంది.

"బాబూ... ధరమం చేయండి! దిక్కూమొక్కూలేని అనాథను బాబూ..." 'గోపాల్ దగ్గరగా వస్తూ అన్నాడో బిక్షగాడు. గోపాల్ అతడివైపు తిరిగి అసహనంగా చూశాడు. జుట్టు పెరిగి. గుడ్డలు చిరిగి. చూడ్డానికి అసహ్యంగా వున్నాడతను! వయస్సు యాభై పైబడి వుండొచ్చు నేమో.... జీవితంలో ఓడిపోయిన వ్యక్తిలా తనవైపే దీనంగా చూస్తున్నాడు.

తన దగ్గర పావలా నాణెం వున్నట్టు గుర్తు! అది ఇద్దామనుకొన్నాడు. మొదట! అమ్మో... పావలానా? అనుకొని భయపడ్డాడు. సరే.... పావలా ఇచ్చి ఇరవై పైసలతని దగ్గర తీసుకొంటే- ఐదు పైసలతనికిచ్చినట్టుంటుంది కదా! .... ఛీ! మనడబ్బు మనకే ఇచ్చినా తన చేయి క్రింద- బిక్షగాడి చేయి పైనా వుండటం తనకిష్టంలేదు. అందుకే- 'లేదుపో....!' అన్నాడు గోపాల్ అసహ్యంగా ముఖంపెట్టి.

'లేదుపో....' అన్న దానికతడేమి బాధపడ్లేదు- అలాంటి చీదరింపులు జీవితంలో ఎన్నోచూశాడు కాబట్టి! దాని స్థానంలో చిన్న చిరునవ్వు అతని పెదవులపై తళుక్కున మెరసి మాయమైంది!

బస్సు వచ్చింది!

తనెక్క వలసిన బస్సు రావడంతో బస్సువైపు ఆనందంగా అడుగులేశాడు గోపాల్. తోటి ప్రయాణీకులందరూ ఆబస్సు చుట్టూ మూగారు?

ఎలాగో తంటాలుపడి బస్సెక్కిన గోపాల్, టిక్కెట్

డబ్బుల కోసం తన చేతిని ఫాంటు జేబులోనికి పోనిచ్చాడు ఆశ్చర్యం!? అతడి పర్సు అతడి జేబులో లేదు– అయ్యో... నా పర్సేమైంది?!

పర్సెవరో కొట్టేశారని తెలుసుకొన్న గోపాల్ బస్సుదిగక తప్పింది కాదు మిగిలిన జేబులన్నీ వెతికాడు– పావలా నాణెం తప్ప మరేమీ కనపళ్ళేదు. ఇప్పుడెలా? ఫ్రెండ్ మ్యారేజి కెళ్ళి వస్తున్నాడు తను. ఫ్రెండ్ వూరినుంచి తన వూరికి రెండు బస్సులు మారాలి తన దురదృష్టం– రెండో బస్సెక్కేప్పుడే ఇలా జరిగింది!

చుట్టూ చూశాడు– తనకు తెల్సిన వారెవరైనా కనపడతారేమోనని! వూహుఁ.. అలాంటి వారెవరూ అతనికి కనపళ్ళేదు!

"బాబూ దరమంసేయండి! దిక్కూ మొక్కూ లేని అనాధను బాబూ.." అలవాటు ప్రకారం కనపడిన ప్రతిమనిషినీ అడిగినట్లు అడిగాడో, సాయంత్రపు మబ్బు తెరలు క్రమ్ముకోవటాన కనుచూపందక అడిగాడో, ఇంతకు ముందు ఇవ్వక పోయినా ఈసారైనా బుద్ధి మారి చిల్లర డబ్బు లిస్తాడన్న ఆశతో అడిగాడో– తెలీదుగానీ.. మొత్తానికి మళ్ళీ గోపాల్ దగ్గరకొచ్చి అడిగాడు – అదే బిక్షగాడు

"లేదని ఇంతకుముందే చెప్పానా? అసలే నా డబ్బు పోయి నేనేడుస్తోంటే మధ్య నీ గొడవేంటి?" అసహనంగా అన్నాడు గోపాల్.

"అఁ... నీ డబ్బులు పోయాయా...!?

'అవును! పోయాయి!!"

"అయ్యో . బాబూ...! ఈ వూరిలో అలాంటి దొంగ వెధవలు జాస్తి! అందుకే పెయాణం జేసేప్పుడు కాస్త జాగ్రత్తగా వుంటాల!

అతడనే మాటలు గోపాల్కినపడటం లేదు. అతడాలోచిస్తున్నదల్లా ఒక్కటే... ఇప్పుడెలా? ఉన్న డబ్బు పోయింది కాబట్టి ఈ రాత్రి కిక్కడ వుండాల్సిందే...! అప్పుడు తనగతి!? కనీసం టిఫిన్ కైనా చిల్లర లేదే...! సరే– టిఫిన్ లేకపోయినా రాత్రంతా ఎక్కడుంటాడు తను? ఒకవేళ రాత్రంతా ఎలాగోలా గడిపినా .. రేపైనా ఎవర్నడగాలిడబ్బు?

"ఏంటి బాబూ... అలో చిత్తా వుండారు?"

"ఈ మహానుభావు డింకా పోలేదా?– అనుకుంటూ అతడివైపు కోపంగా ముఖం పెట్టి – "ఏదైతే నీ కెందుకు? మూడు రూపాయలు కావాలి! ఇస్తావా??" విసుగ్గా– వ్యంగ్యంగా అన్నాడు గోపాల్.

గోపాల్ అలా అన్నదే తడవు వెంటనే తన దగ్గరున్న చిల్లరని లెక్కపెట్టసాగాడతను! ఈసారి ఆశ్చర్యంగా అతడివైపు చూడక తప్పిందికాదు గోపాల్కు.

ఏమిటి తను? నేను మాట వరుసకంటే నిజంగానే ఇచ్చేస్తున్నాడేఁ....! ఇప్పుడేమిటీ చెయ్యడం?భగవాన్.... నా కెందుకీ దుస్థితి!

"ఏంటి బాబూ.... మౌనంగా వుండారు. ఈ బిక్షగాడి డబ్బులు తీసుకోకూడదా!" చిల్లరంతా




లెక్కపెట్టి చేయి ముందుకు జాపాడతను.

అప్రయత్నంగా కళ్ళనిండా నీళ్ళు గిర్రున తిరిగాయి గోపాల్కు. దుఃఖః పొంగుకు రాగా బలవంతంగా ఆపుకొన్నాడు – నిజంగా ఇతడెంత మంచివాడు! అతనికున్న మానవత్వం తనకు లేకపోయింది అందుకేనేమో సాటి మనిషిగా వుండి, అతడి పరిస్థితి కళ్లారా చూసి కూడా.... కనీసం ఓ ఐదు పైసలు ఇవ్వలేక పోయాడు. అతడిలోని మానవత్వానికి – చేతులెత్తి దణ్ణం పెట్టాలనిపించిందనికి! అంతలోనే ఆ ప్రయత్నం విరమించుకొన్నాడు – ఎవరైనా చూస్తారేమోనని! తనకు మానవత్వం లేదని మరోసారి రుజువైంది! చిన్నగా నవ్వాడు గోపాల్ ఎందుకో!

తీసుకోండి బాబూ.... మీకంత ఇదిగా వుంటే మళ్లా ఎప్పుడైనా ఈడకొస్తే ఇచ్చేయండి – "తీసుకొంటా!"

గత్యంతరం లేని గోపాల్ ఆ డబ్బు అందుకొనేందుకు అప్రయత్నంగానే తన చేతిని ముందుకు జాపాడు!

అప్పుడే కదుల్తున్న బస్సెక్కి, "అయ్యా.... నే నెప్పుడైనా ఇక్కడికొస్తే నీ డబ్బు తప్పక ఇచ్చేస్తాను" అన్నాడు గోపాల్. గోపాల్ అన్న మాటలు కదిలే బస్సు శబ్దంలో అతడికి వినపళ్ళేదు గానీ.... బిక్షగాడా రాత్రికి తిండిలేక పస్తుంటాడని గోపాల్కు తెలీదు! ◘